

ఆంధ్రజ్యోతి
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 1 జులై 2025



పైసా వసూల్!

జిల్లాలో పోలీస్‌శాఖ నిర్వాకం

- ఎస్‌ఐల బదిలీల్లో ఇష్టారాజ్యంగా వసూళ్లు!
- ఆయా స్టేషన్లలో అక్రమాలకు తెరతీసిన సీఐ, ఎస్‌ఐలు
- మహిళా పోలీసుల బదిలీల్లో నిబంధనలకు నీళ్లు
- కలెక్టర్‌ను ఆశ్రయించిన పలువురు మహిళా పోలీసులు

జిల్లాలో పోలీస్ వ్యవస్థ గాడి తప్పింది. ఎస్పీ కార్యాలయంలో ఉండే కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎస్‌ఐల బదిలీల్లో భారీగా వసూళ్లకు పాల్పడినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. పోస్టింగ్ కోసం నగదు చెల్లించిన సదరు అధికారులు ఆయా పోలీస్ స్టేషన్లలో అక్రమాలకు తెరతీస్తున్నారని సమాచారం. ప్రతి పనికి ఓ ధర నిర్ణయించి ముందుకు సాగుతున్నారని తెలిసింది. గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే మహిళా కానిస్టేబుల్ల బదిలీల్లోనూ అక్రమాలు జరిగినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.



కలెకర్‌కు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ మహిళా పోలీసులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా ఎస్పీ కార్యాలయం మొత్తాన్ని ప్రత్యేక విభాగం కార్యాలయంలో పనిచేసే కొందరు అధికారులు, సిబ్బంది తమ చెప్పుచేతల్లోకి తీసుకుని, తమదైన శైలిలో ఉన్నతాధికారికి తప్పుడు సమాచారం ఇస్తూ తెరవెనుక వ్యవహారాలు నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఎస్‌ఐ స్థాయి అధికారుల బదిలీల్లో ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో వచ్చే ఆదాయాన్ని బట్టి ధర నిర్ణయించి మరీ లక్షల్లో నగదు వసూలు చేశారనే విమర్శలు ఉన్నాయి. నగదు చెల్లించి పోస్టింగ్ పొందిన ఎస్‌ఐలు ప్రతిపనికి ఒకరేటు నిర్ణయించి పెద్ద మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌ఐ, సీఐ స్థాయి మిగతా 6లో..

నయా దందా!

తాడిగడప మునిసిపాలిటీలో అక్రమ నిర్మాణాలు!

నివాస గృహాల ప్లాన్లతో అపార్టుమెంట్లు కట్టేస్తున్నారు

తాడిగడప మునిసిపాలిటీలో నయా దందా నడుస్తోంది. దళారులుగా మారిన బిల్డర్లు ఇటు స్థల యజమానులు, అటు అధికారులతో కుమ్మక్కై, సాధారణ గృహాలకు అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్లనే నిర్మించేస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా లక్షల రూపాయలు ముట్టజెబుతున్నారు. భవనాలకు అన్ని అనుమతులు ఉన్నాయని మాయ మాటలు చెబుతూ ఫ్లాట్ల అమ్మకాలు చేస్తున్నారు. వీరి మాటలు నమ్మి కొనుగోలు చేసిన వారు ఆ తర్వాత ఆస్తి పన్ను, అక్రమ నిర్మాణాల జరిమానాలతో అవస్థలు పడుతున్నారు.

- చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- దళారీ అవతారమెత్తి అంతా చక్కబెడుతున్న బిల్డర్లు
- అన్ని అనుమతులు ఉన్నాయంటూ ఫ్లాట్ల అమ్మకాలు
- కొనుగోలు చేస్తే ఆస్తి పన్నుతో పాటు జరిమానాల భారం
- స్థల యజమాని, బిల్డర్, అధికారులు కుమ్మక్కై కుట్ర

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో అక్రమ భవన నిర్మాణ పేరుతో నయా దందా జోరుగా సాగుతోంది. స్థల యజమానులు, బిల్డర్లు, మున్సిపల్ అధికారులు కుమ్మక్కై నడిపే ఈ వ్యవహారంలో కొనుగోలు దారులు బాధితులుగా మారుతున్నారు. మోసం ఎలా చేస్తున్నారంటే.. తమ స్థలాల్లో సాధారణ గృహాలను కట్టే పేరుతో వాటి యజమానులు బిల్డర్లను మీడియేటర్లుగా పెట్టుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. సాధారణ వ్యక్తిగత నివాస గృహాలకు బిల్డర్లతో సహజంగా సంబంధం ఉండదు. కాంట్రాక్టర్లతో నిర్మాణాలు చేయించే పరిస్థితి అయితే ఉంటుంది. అపార్ట్‌మెంట్స్ గ్రూప్ హౌస్ నిర్మాణాలు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణాలకు సంబంధించి బిల్డర్లతో యజమానులు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ కుదుర్చుకుంటారు. కానీ, తాడిగడపలో మాత్రం సాధారణ నివాసాలకు కూడా బిల్డర్లను తెరమీద పెట్టి ప్లాన్లకు దరఖాస్తు చేస్తున్నారు. వాస్తవానికి స్థల యజమానులకు, బిల్డర్లకు ఎలాంటి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ ఉండవు. పార్టనర్‌షిప్ డీడ్స్ కూడా ఉండవు. కానీ, యజమానుల తరఫున బిల్డర్లే తాడిగడప మునిసిపాలిటీలో ప్లాన్ల మంజూరు వ్యవహారాలను చూస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇంకో ట్విస్ట్ ఏమిటంటే.. కొంతమంది బిల్డర్లకు, తాడిగడప మునిసిపల్ అధికారులకు సంబంధ బాంధవ్యాలు పతాక స్థాయిలో ఉన్నాయని చర్చ జరుగుతోంది. ఒకరకంగా మునిసిపాలిటీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన కమిషనర్లకు, ప్రస్తుత టౌన్ ప్లానింగ్ అధికారులకు ఏజెంట్లుగా ఈ బిల్డర్లు ఉంటున్నారు. స్థల యజమానులు భవన నిర్మాణాలకు సిద్ధం కావాలంటే బిల్డర్లను, లైసెన్స్‌డ్ సర్వేయర్లను అనధికార భాగస్వామ్యం చేసుకోవాలన్న వాతావరణాన్ని కొంత కాలంగా అధికారులు ఇక్కడ తీసుకువచ్చారు. మునిసిపల్ కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ మిగతా 6లో..

తాడిగడపలో అనధికార నిర్మాణం



ఎవరినీ అడగలేని దైన్యం

ఫ్లాట్లను అమ్మేటపుడే కొనుగోలుదారుడిదే పూర్తి బాధ్యత అన్నట్టు అగ్రిమెంట్ మీద సంతకాలు చేయించుకుంటారు. కాబట్టి స్థల యజమానిని ఏమీ అడగలేరు. బిల్డర్లను అడుగుదామంటే యజమానులతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్స్ ఉండవు. మునిసిపాలిటి అధికారులను అడిగితే తప్పంతా మీదేనంటూ వారికి చుక్కలు చూపిస్తున్నారు. దీంతో ఏమీ చేయలేని స్థితిలో కొనుగోలుదారులు ఉంటున్నారు.

ఆ అధికారం మునిసిపల్ అధికారులకు ఉందా ?

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్)ను అమలు చేసే పరిస్థితి లేదు. భవిష్యత్తులో కూడా అనుమతి వచ్చే అవకాశం లేదు. ఇలాంటపుడు అక్రమ కట్టడాల పేరుతో జరిమానాలు వసూలు చేసే అధికారం తాడిగడప మునిసిపాలిటీ అధికారులకు లేదు. కానీ వసూళ్లకు పాల్పడుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి.

కొన్న తర్వాత అసలు సినిమా

తెరవెనుక జరిగిన విషయాలు తెలియక కొనుగోలు చేసిన వారికి ఆ తర్వాత సినిమా కష్టాలు మొదలవుతాయి. అనధికార కట్టడాల పేరుతో కొనుగోలు చేసిన వారి ఆస్తి పన్నుకు రెట్టింపుతో జరిమానాలు కట్టించుకుంటున్నారు. సగటున ఆస్తి పన్ను రూ.10 వేలు అనుకుంటే అక్రమ నిర్మాణం పేరుతో మరో రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇది కాకుండా ఇచ్చిన ప్లాన్‌కు డీవియేషన్స్ పేరుతో అదనంగా మరికొంత పెనాల్టీలు వేస్తున్నారు. ఈ పెనాల్టీల భారంతో కొనుగోలుదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ప్లాన్ ఇచ్చేశాక.. ఇక ఆ వైపు చూడరు

స్థల యజమానులు 194, 200, 250, 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే గృహాలకు అధికారులు నిబంధనల మేరకు అనుమతులు ఇచ్చేస్తారు. ఆ తర్వాత వారు అక్కడ ఏమి నిర్మాణాలు చేస్తున్నారో.. చేశారో చూడటం లేదు.

రూ.40,17,578 చెల్లించండి

- మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం
- వినియోగదారుల ఫోరం సంచలన తీర్పు
- 30 రోజుల్లో చెల్లించాలని ఆస్పత్రికి నోటీసులు

6

పంద్రాగస్టుకు పదిసూత్రాల శకటాలు

- కలెక్టర్ బాలాజీ

6

చివరి రోజు 779 మంది ఏఎన్ఎంల బదిలీ

దుబాయిలోనూ దుకాణం

అద్వికా ఏర్పాటుకు భారీ స్కెచ్

- పలుమార్లు అక్కడికి వెళ్లొచ్చిన ఆదిత్య
- తాజాగా 42 మంది ఏజెంట్లకు నోటీసులు
- తిరిగొస్తానని ఏజెంట్లకు చెబుతున్న ఆదిత్య
- రంగంలోకి రాజకీయ దళారులు
- డబ్బు ఇప్పిస్తామంటూ ఏజెంట్లతో బేరాలు



నగరంలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడలో అద్విక ట్రేడింగ్ కంపెనీ ఏర్పాటుచేసి రూ.కోట్లు లూటీ చేసిన తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య దుబాయిలోనూ ట్రేడింగ్ కంపెనీలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకున్నాడు. అందుకే ఇక్కడ పెట్టుబడిదారుల నుంచి వసూలు చేసిన డబ్బును దుబాయిలోని కబానా ట్రేండింగ్ కంపెనీకి పంపినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నామని ఏజెంట్లకు, ఖాతాదారులకు ఆదిత్య చెప్పినట్టు తెలిసింది. అద్వికలో డైరెక్టర్‌గా కిరణ్‌కుమార్, గిరి, సలహాదారురాలిగా ఉన్న కీర్తిని తీసుకుని పలుమార్లు దుబాయి వెళ్లి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. కొన్నాళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఐబిస్, వెస్టిన్ స్టార్ హోటళ్లలో రెండు బిజినెస్ మీట్లు నిర్వహించినట్టు ఏజెంట్లు చెబుతున్నారు. ఈ సమావేశాలకు దుబాయిలోని కబానా సంస్థకు చెందిన ప్రతినిధులను తీసుకొచ్చాడని తెలుస్తోంది. పోలీసులు మిగతా 6లో..

రంగంలోకి రాజకీయ దళారులు

అద్వికలో పెట్టుబడిదారులుగా ప్రముఖులు ఉన్నాయి. ఎవరి డబ్బును వారు ఇప్పించుకునే పనిలో పడ్డారు. సందట్లో సడేమియా అన్నట్టుగా రాజకీయ దళారులు రంగంలోకి దిగారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఏజెంట్లు అద్విక కార్యాలయం వద్ద చర్చించుకున్నారు. నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే పీఏ టచ్‌లోకి హైదరాబాద్, విశాఖపట్నం ఏజెంట్లు వెళ్లినట్టు తెలిసింది. అసలు మొత్తాన్ని వెనక్కి ఇప్పించినందుకు కొంత మొత్తాన్ని డిమాండ్ చేసినట్టు చెప్పుకొంటున్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

డివైడర్‌ను బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి

మచిలీపట్నం శారదానగర్‌లో ఘటన

- ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో క్లీనర్లుగా పనిచేస్తున్న మృతులు
- చిన్నాపురం, రామకృష్ణాపురంలో విషాదం





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పవన్‌కల్యాణ్, రవీంద్ర



రవీంద్ర (ఫైల్)

మచిలీపట్నం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనం నడిపి ఇద్దరు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన సోమవారం మచిలీపట్నం శారదానగర్‌లో జరిగింది. ఇనకుదురుపేట ఎస్సై వైవివి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో క్లీనర్లుగా పనిచేస్తున్న బందరు మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన దాలిపర్తి పవన్‌కల్యాణ్ (23), కోడూరు మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మేడా రవీంద్ర (25) స్నేహితులు. వీరు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బందరు మండలం చిన్నాపురం గ్రామం నుంచి మచిలీపట్నం వస్తున్నారు. మార్గమధ్యంలో శారదానగర్ వద్ద వేగంగా మిగతా 6లో..



శాకంబరీ ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఈవో తదితరులు

8 నుంచి శాకంబరీ ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ శాకంబరీ ఉత్సవాలు ఆషాఢ శుద్ధ త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు జూలై 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం ఈవో శీనానాయక్ చాంబర్‌లో ఈఈ కేవీఎస్ఆర్ కోటేశ్వరరావు, డీఈలు రవీంద్ర, కోటేశ్వరరావు, సహాయ కమిషనర్ సీహెచ్ రంగారావులతో కలిసి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఏటా ఆషాఢమాసంలో మూడు రోజుల పాటు కనకదుర్గమ్మకు శాకంబరీ ఉత్సవాలు జరుగుతాయని, ఆ సమయంలో అమ్మవారి మూలవిరాట్టుతోపాటు, ఉపాలయాలలో కొలువైన దేవతా మూర్తులకు, ఆలయ ప్రాంగణాలల్లో వివిధ రకాల కూరగాయలతో అలంకరిస్తారని తెలిపారు.

కూరగాయల సేకరణకు..

శాకంబరీ ఉత్సవాలలో వినియోగించేందుకు కూరగాయలను విరాళంగా సేకరించేందుకు దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్, గుమస్తాలు పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పర్యటించారు. సోమవారం ఏలూరు, తాడేపల్లి గూడెం, తణుకు కొత్తపేట, మడికి, సిద్ధాంతం తదితర ప్రాంతాల్లో పర్యటించి మార్కెట్లను, వ్యాపారులను కలిశారు. కూరగాయలను అందించాలని కోరారు.

దుర్గమ్మను దర్శించుకున్న త్రిపుర గవర్నర్



కనకదుర్గమ్మను సోమవారం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఈవో, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా కొండరాళ్ల తొలగింపు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రి దిగువన కేశఖండనశాల పక్కన ప్రధాన రహదారిపై పడిన కొండరాళ్లను, మట్టిని తొలగించే కార్యక్రమాన్ని ఈవో సోమవారం రాత్రి పర్యవేక్షించారు. కనకదుర్గనగర్‌లో లెవలింగ్ పనులను పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో ఉద్యోగం చేస్తూ భక్తులకు సేవచేయడం పూర్వజన్మ సుకృతమేనని ఈవో శీనానాయక్ తెలిపారు. దేవస్థాన ఉద్యోగి వై.రామకోటేశ్వరరావు పదవీ విరమణ సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు .కోటేశ్వరరావు దంపతులను సముచిత రీతిని సత్కరించారు.

కొబ్బరిచిప్పల కాంట్రాక్టర్‌కు రూ. 25వేలు జరిమానా

దుర్గగుడిపై కొబ్బరిచిప్పలను పోగు చేసుకునే కాంట్రాక్టర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఈవో శీనానాయక్ సోమవారం రూ.25 వేలు జరిమానా విధించారు. ఈవో బాధ్యతలు చేపట్టిన నెల రోజుల కాలంలో సెక్యూరిటీ, శానిటేషన్, టోల్‌గేట్, క్లోక్ రూమ్ కాంట్రాక్టర్లు నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా ఒక్కొక్కరి నుంచి రూ 25 వేలు చొప్పున జరిమానా వేశారు. కాంట్రాక్టర్ల డిపాజిట్ నుంచి జరిమానా సొమ్ము వసూలు చేస్తామని, మార్పురాకుంటే కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టి రద్దు చేస్తామని హెచ్చరించారు.

పంద్రాగస్టుకు పదిసూత్రాల శకటాలు తయారు చేయండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న పదిసూత్రాల కార్యక్రమాలను ప్రజలకు పూర్తిస్థాయిలో తెలియజేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ప్రజలనుంచి 169అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలుచేసే 10సూత్రాల కార్యక్రమాలను తెలియజేస్తూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక శకటాలను తయారు చేయాలన్నారు. వివరాలను సీపీవో, సమాచారశాఖకు అన్నిశాఖల అధికారులు అందజేయాలన్నారు. జలవనరులశాఖలో 55, పంచాయతీరాజ్ విభాగంలో 15కోర్టు కేసులు పెండింగ్ ఉన్నాయని, వీటికి సంబంధించిన కౌంటర్‌లను త్వరితగతిన దాఖలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులపై వేధింపుల నివారణకోసం ప్రభుత్వ కార్యాలయాల్లో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మెప్మాలో పనిచేస్తున్న రీసోర్స్ పర్సన్‌లకు ట్యాబ్‌లను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పర్హీన్‌జాహిద్, ఏఎస్పీ సత్యనారాయణ, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, మెప్మా పీడీ సాయిబాబు, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో కె.స్వాతి, డీఎస్‌వో పార్వతి, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేశ్, ఉద్యానశాఖ అధికారి జ్యోతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా పరిష్కారం చూపాలి : జేసీ

కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 134 అర్జీలు వచ్చాయని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని జేసీ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, అర్జీదారులు సంతృప్తిచెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గుళ్లపల్లికి జీవిత సాఫల్య పురస్కారం

లబ్బీపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నేత్ర వైద్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పటల్ అందిస్తున్న సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పటల్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావుకు జీవిత సాఫల్య పురస్కారం అందజేసింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న రోటరీ క్లబ్ తనకు ఈ పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి రవి ప్రకాష్, అధ్యక్షులు బి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన అతివేగం

(5వ పేజీ తరువాయి)

వస్తున్న బైక్ అదుపుతప్పి డివైడర్‌ను, ఎలక్ట్రికల్ పోల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పవన్ కల్యాణ్, రవీంద్ర తలలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదాన్ని చూసిన వాహనదారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పవన్‌కల్యాణ్‌కు తండ్రి లేడు. తల్లి నాగమణి, ఒక సోదరి ఉన్నారు. ఉన్న ఒక్కగాని ఒక్క కొడుకు మృతి చెందడంతో తల్లి నాగమణి కన్నీరుమున్నీరుగా విలపించింది. రవీంద్ర తల్లిదండ్రులు మేడా సుజాత, మేడా ప్రసాద్ పొట్టకూటి కోసం నెల్లూరు వెళ్లి అక్కడే ఉంటున్నారు. వీరితోపాటే రవీంద్ర తమ్ముడు ఉంటున్నాడు. కొడుకు మరణవార్త తెలుసుకున్న వారు వెంటనే బందరు వచ్చి విగత జీవిగా పడి ఉన్న బిడ్డను చూసి బోరున విలపించారు. ఇద్దరు యువకుల మృతితో చిన్నాపురం, రామకృష్ణాపురంలో విషాద చాయలు అలుముకున్నాయి.

మూడ్రోజులకే.. మురిగిపోతున్నాయ్!





గండేపల్లి, కంచికచర్ల పాఠశాలల్లో మురిగిపోయిన గుడ్లు

మధ్యాహ్న భోజనం పథకం గుడ్లు మురిగిపోతున్నాయి. సరఫరా చేసిన మూడు రోజులకే గుడ్లు మురిగిపోవటం వల్ల ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. విద్యార్థులకు అందించాల్సిన గుడ్లు పాడైపోవడంతో గత్యంతరం లేక పారేస్తున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న గుడ్లను సరఫరా చేయటం వల్ల అవి మురిగిపోతున్నాయని ఆరోపిస్తున్నారు.

» మధ్యాహ్న పథకంలో నిల్వ గుడ్లు సరఫరా
» పిల్లలు తింటే ఫుడ్ పాయిజన్ ప్రమాదం
» చేసేదిలేక పారేస్తున్న ఉపాధ్యాయులు
» కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

కంచికచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ.. హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన (మిడ్ డే మీల్స్) పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. భోజనంలో వారానికి ఐదు రోజులు తప్పనిసరిగా విద్యార్థులకు కోడిగుడ్లు అందచేయాల్సి ఉంది. మూడురోజులు ఉడికించిన గుడ్డు, రెండ్రోజులు ఉడికించి వేయించిన గుడ్డు విద్యార్థులకు ఇవ్వాలి. ఇందుకు గాను విద్యార్థుల హాజరును బట్టి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాశాఖ యాప్‌లో నెలకు సరిపడ గుడ్లకు ఇండెంట్ పెడతారు. కాంట్రాక్టరు ప్రతి వారం పాఠశాలకు వెళ్లి హెచ్ఎంలకు గుడ్లు అందజేస్తారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. 12వ తేదీతో పాటు 20, 28 తేదీల్లో కాంట్రాక్టరు పాఠశాలలకు గుడ్లు సరఫరా చేశాడు. అయితే 28న సరఫరా చేసిన గుడ్లు ఎక్కువ భాగం మురిగిపోయాయి. ఉడకబెట్టిన తర్వాత భరించలేని దుర్వాసన వస్తున్నది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు గుడ్లను పారవేస్తున్నారు. కాంట్రాక్టరు నిల్వఉన్న గుడ్లను సరఫరా చేయటం పట్ల మురిగిపోయాయని ఆరోపిస్తున్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల సమాచారం మేరకు గండేపల్లి పాఠశాలలో 38, కంచికచర్ల ఇందిరాకాలనీ పాఠశాలలో 54, కీసర మెయిన్ పాఠశాలలో ఆరు, పేరకలపాడు పాఠశాలలో 50, పరిటాల హెచ్‌డబ్ల్యు పాఠశాలలో కొన్ని గుడ్లు మురిగిపోయాయి. గుడ్లు ఎక్కువగా మురిగిపోవటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పాడైపోయిన గుడ్లు తింటే ఫుడ్ పాయిజన్ అయి తాము బలికావల్సి వస్తుందని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా అందిస్తున్న సన్నబియ్యం చాలా బాగున్నాయని, విద్యార్థులు ఎంతో ఇష్టంగా తింటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతంతో పోల్చితే చిక్కీలు, రాగి పిండి, బెల్లం పిండితో పాటుగా బ్యాగులు, దుస్తులు నాణ్యతాపరంగా బాగున్నాయని అంటున్నారు. అయితే ఫుడ్ పాయిజన్ కాకముందే ప్రభుత్వం స్పందించి నిల్వ గుడ్లను సరఫరా చేసిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. మురిగిపోయిన గుడ్ల విషయమై మండల విద్యాశాఖాధికారి బాలాజీ నాయక్‌ను వివరణ కోరగా.. మండలానికి సరఫరా అవుతున్న గుడ్లపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గుడ్లు ఎక్కువగా మురిగిపోతున్నాయంటూ పలువురు ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ అంశాన్ని వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలియపర్చినట్టు ఆయన పేర్కొన్నారు. ఇకపై బాగున్న గుడ్లు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న శర్మిష్ట

చివరి రోజు 779 మంది

ఏఎన్ఎంల బదిలీ

» రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ

మచిలీపట్నం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లా సచివాలయాల్లో 779 మంది ఏఎన్ఎంలను బదిలీలు చేశారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌కు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని 779 మంది ఏఎన్ఎంలు రావడంతో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఏఎన్ఎంలు గంటల తరబడి నిరీక్షించారు. కౌన్సెలింగ్‌కు సోమవారం చివరిరోజు కావడంతో ఏఎన్ఎంలు తమకు కావలసిన స్థానాన్ని కోరుకున్నారు. ఐదేళ్ల సర్వీసు నిండిన వారిని బదిలీ చేశారు. మెరిట్, సీనియారిటీ ఆధారంగా బదిలీలు జరిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్టతో పాటు డిప్యూటీ విజయభారతి తదితరులు బదిలీల ప్రక్రియను నిర్వహించారు.

రూ.40,17,578 చెల్లించండి

» మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం
» వినియోగదారుల ఫోరం సంచలన తీర్పు
» 30 రోజుల్లో చెల్లించాలని ఆస్పత్రికి నోటీసులు

మచిలీపట్నం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మహిళ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని, పిలలకు తల్లి లేనిలోటు తీర్చలేనిదని, ఆ కుటుంబానికి సదరు ఆస్పత్రి వైద్యులు రూ.40,17,578 చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు, న్యాయమూర్తి నందిపాటి పద్మారెడ్డి తీర్పు ఇచ్చారు. వివరాలలోకి వెళితే.. ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామానికి చెందిన మద్దిర నాగవెంకట శ్రీనివాసరావు భార్య శివనాగలక్ష్మి కడుపునొప్పితో బాధపడుతుండగా భీమవరం శ్రీ హాస్పటల్‌లో 2020 డిసెంబర్ 30న చేర్పించారు. డాక్టర్ గిరికుమార్ శాస్త్రి 2021 జనవరి 2న గర్భసంచి ఆపరేషన్ చేశారు. జనవరి 3న ఆమె తీవ్ర కడుపు నొప్పితో మూత్ర విసర్జన ఆగిపోయింది. దీంతో భీమవరంలోని ఇంటీరియల్ ఆసుపత్రి డాక్టర్ అశోకవర్మ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జనవరి 7న మృతిచెందింది. దీనిపై శివనాగలక్ష్మి భర్త శ్రీనివాసరావు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. న్యాయమూర్తి పద్మారెడ్డి, మహిళా సభ్యురాలు శ్రీలక్ష్మి కేసు పూర్వాపరాలు పరిశీలించి వైద్యుల నిర్లక్ష్యం వల్లే శివనాగలక్ష్మి మృతి చెందినట్టు తేల్చారు. పిల్లలకు తల్లిలేని లోటు తీర్చలేనిదని.. సదరు ఆస్పత్రి రూ.37,13,000, మెడికల్ బిల్లులు రూ.3,04,578 తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పుచెప్పారు. కోర్టు ఖర్చుల నిమిత్తం రూ. 40వేలు ఫిర్యాదుదారుడు మద్దెల నాగవెంకట శ్రీనివాసరావుకు ఇంటీరియల్ ఆసుపత్రి చెల్లించాలని నోటీసు ఇచ్చారు. 30 రోజుల్లోగా తీర్పు అమలు చేయాలన్నారు.

నర్సాపూర్-ఎస్ఎంవీటి బెంగుళూరు ప్రత్యేక రైలు వేళల మార్పు

రైల్వేస్టేషన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్-ఎస్ఎంవీటీ బెంగుళూరు ప్రత్యేక రైలు విజయవాడ, గూడూరు స్టేషన్ల రాకపోకల వేళల్లో మార్పులు చేసినట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో ఎన్ మంద్రుప్‌కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07153 నర్సాపూర్-ఎస్ఎంవీటీ బెంగుళూరు రైలు జూలై 4 నుంచి సెప్టెంబరు 26 వరకు ప్రతి శుక్రవారం నడుస్తుంది. 07154 ఎస్ఎంవీటీ-బెంగుళూరు రైలు జూలై 5 నుంచి సెప్టెంబరు 27వరకు ప్రతి శనివారం నడుస్తుంది. 07153 రైలు 7.15కి వచ్చి 7.25కి బయలుదేరుతుంది. గూడూరు స్టేషన్‌కు రాత్రి 12.23కి వచ్చి 12.25కి బయలుదేరుతుంది.

వెళ్లిపోవాలని

వేధిస్తున్నారు!

» పెట్రోల్ పోసుకుని గ్రామ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం
» టీడీపీ కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు



వత్సవాయి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నుంచి తనను బలవంతంగా పంపించేందుకు విధులకు ఆటంకాలు కల్గిస్తున్నారని, మానసికంగా ఇబ్బందలకు గురి చేస్తున్నారంటూ మనస్తాపంతో వత్సవాయి మండలం దేసుపాలెం గ్రామ కార్యదర్శి సుబేదర్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. టీడీపీ కార్యకర్త అన్నెపాక హరీష్ ఇంటి ముందు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోబోయారు. వెంటనే స్థానికులు అమెను అడ్డుకుని రక్షించారు. ఈ సంఘటన జగ్గయ్యపేటలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడ పనిచేస్తున్న గ్రామకార్యదర్శి నాగరాజు బదిలీ కాగా.. ఆయన స్థానంలో గ్రామ కార్యదర్శిగా సుబేదర్ వచ్చారు. అయితే తనను టీడీపీ కార్యకర్త హరీష్, వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన జలీల్ ఇద్దరూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. 'దేసుపాలెం కార్యదర్శిగా నువ్వు ఇక్కడ అక్కర్లేదు.. గతంలో పనిచేసిన నాగరాజు బాధ్యతలు స్వీకరించేందుకు వస్తాడు.. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి' అంటూ బెదిరిస్తున్నారని ఆరోపించింది. తాను ఏం చేయలేనని సుబేదర్ పేర్కొనడంతో కోపం పెంచుకున్న హరీష్, జలీల్‌లు తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఏడాది మే నెలలో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో హరీష్ మే 4న కార్యదర్శి సుబేదర్‌తో తనకు ప్రాణహాని ఉందని కోర్టును ఆశ్రయించారు. తర్వత వీరిద్దరూ సుబేదర్‌ను మరింత ఇబ్బంది పెట్టారని సమాచారం. వేధింపుల వల్లే తన భార్య ఆత్మహత్యాయత్నం చేసుకుందని భర్త ఎస్‌కే అలీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

సర్పంచ్ ఆత్మహత్యాయత్నం!

» మండల సమావేశంలో పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్

తోట్లవల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బిల్లులు చేయకుంటే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని వైసీపీకి చెందిన గుర్విందపల్లి సర్పంచ్ బాసంశెట్టి ఉదయభాస్కర్ హల్‌చల్ చేశారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణిఅధ్యక్షతన సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. పీఆర్ ఏఈ శరాబందిరాజు మాట్లాడిన తరువాత సర్పంచ్ ఉదయభాస్కర్ లేచి తాను పనులు చేపట్టి లక్షలు ఖర్చుపెట్టి అప్పుల పాలయ్యానని, బిల్లులు చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్‌ను బయటకు తీశారు. వెంటనే పక్కనే ఉన్న వైస్ ఎంపీపీ కళ్లం సాంబశివారెడ్డి అడ్డుకున్నారు. ఏఈ శరాబంది రాజు కలుగజేసుకుని రెండేళ్ల క్రితం చేసిన పనులకు ఇప్పుడు బిల్లు చేయమంటున్నారని, పాత ఏఈతో బిల్లు చేయించుకోవాలని.. బస్‌షెల్టర్‌కు కూడా ఇష్టారాజ్యంగా చేసి బిల్లు చేయమంటే ఎలాగని అన్నారు. అధికారుల తీరువల్ల ఆత్మహత్య చేసుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయని శివారెడ్డి ధ్వజమెత్తారు. అంతకుముందు ఇసుక అక్రమరవాణా జరుగుతుంటే ఎందుకు అరికట్టడం లేదని ఎంపీపీ రాజామణి, వైస్ ఎంపీపీ శివారెడ్డి తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవమానించాడని ఆత్మహత్య!

నందిగామ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లోని వ్యక్తి అవమానించాడన్న మనస్తాపంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నెమలిపురి తిరుపతిరావు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెలది గోపాలకృష్ణమూర్తి వాచ్‌మెన్ భార్య పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్టు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ఆమె రెండ్రోరోజుల క్రితం కుమార్తె(మైనర్)తో కలిసి పురుగుమందు తాగింది. విజయవాడలో చికిత్సపొందుతూ లక్ష్మీప్రసన్న మృతిచెందగా, కుమార్తె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు. తన భార్యను కృష్ణమూర్తి లైంగికంగా వేధింపులకు గురిచేశాడని తిరుపతిరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

తానా ఫౌండేషన్ ట్రస్టీగా ఠాగూర్ మల్లినేని

పెనమలూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా)ఎన్నికల్లో పెనమలూరుకు చెందిన ఠాగూర్ మల్లినేని 2025-29 కాలానికి ఫౌండేషన్ ట్రస్టీగా ఎంపికయ్యారు. ఆయన తానాలో కొన్ని సంవత్సరాలుగా కీలక పాత్ర పోషిస్తున్నారు.

దుబాయిలోనూ

దుకాణం

(5వ పేజీ తరువాయి)

ఎంత విచారణ చేసినా ఆదిత్య మాత్రం నోరు విప్పట్లేదు. ఏజెంట్లను పిలిపించి విచారణ చేసి వివరాలను తెలుసుకోవాల్సి వస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 35 మంది ఏజెంట్లు ఉంటారని భావించారు. ఇప్పుడు ఈ సంఖ్య 42కు పెరిగింది. వాళ్లందరికీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఒక్కో ఏజెంట్‌ను పిలిపించి వివరాలు తెలుసుకుంటున్నారు. ఆ ఏజెంట్లు ఎంత మొత్తంలో పెట్టుబడి పెట్టారు, ఎంతమందితో ఎంతెంతె మొత్తంలో పెట్టుబడి పెట్టించారు, పేఅవుట్లు (చెల్లింపులు) ఎంత మొత్తం తీసుకున్నారు అనే వివరాలు బయటకు లాగుతున్నారు. ఆదిత్య మొత్తం డేటాను డిలీట్ చేయడంతో లెక్కలు తేల్చడానికి నానాపాట్లు పడాల్సి వస్తోంది. ఏజెంట్లు ఇచ్చిన లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

ఇలా పెట్టుబడి.. అలా చెల్లింపులు..

ఆదిత్య వాట్సాప్ చాటింగ్‌లను పరిశీలించిన పోలీసులకు ఒక విషయంలో మాత్రం స్పష్టత వచ్చింది. పెట్టుబడిగా వచ్చిన ఏ ఒక్క రూపాయికి అతడు రికార్డులు నిర్వహించలేదు. పెట్టుబడిగా వచ్చిన డబ్బును బకాయిదారులకు చెల్లించినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో అద్విక బోర్డు ఏర్పాటు చేసుకుని ఇద్దరు కార్యాలయాలు నిర్వహించారు. వారిలో ఒకరు రూ.25 కోట్లు పెట్టగా, మరొకరు రూ.50 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టించాడు. ఇందులో ఒక వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ ఇద్దరితో ఆదిత్య చేసిన చాటింగ్‌ను పోలీసులు చదివారు. పెట్టుబడిదారులు ఒత్తిడి చేస్తున్నారని, వారిలో కొంత మంది రాజకీయ నేతలతో ఒత్తిడి చేయిస్తున్నారని చాటింగ్ చేశాడు. త్వరలో భారీ మొత్తంలో ఒక పెట్టుబడి వస్తుందని, అది రాగానే అందులో నుంచి ఆ అకౌంట్లను సెటిల్ చేద్దామని ఆదిత్య సమాధానం ఇచ్చాడు. దీన్నిబట్టి ఆదిత్య ఎక్కడా రికార్డులు నిర్వహించలేదని గుర్తించారు. మరోపక్క గోల్డెన్ లీఫ్ నకిలీ వెబ్‌సైట్‌ను జనం నుంచి డబ్బు వసూలు చేయడానికి విరివిగా ఉపయోగించుకున్నాడు. అద్వికకు సలహాదారులుగా ఉన్న కీర్తి, ఆమె భర్త నరసింహారావు సింగపూర్‌లో ఫారెన్ ఎక్స్ఛేంజ్ విభాగంలో పనిచేశారు. అద్వికలో ఈ గోల్డెన్ లీఫ్‌ను కీర్తి నిర్వహించింది. అద్వికలో పెట్టుబడులు పెట్టిన వారికి ఇందులో ఖాతాలు సృష్టించారు. ఇందులో కీర్తి 40 శాతం వాటా పెట్టినట్టు చూపించారు.

మళ్లీ వస్తా.. రెట్టింపు వ్యాపారం చేద్దాం

పోలీసుల అదుపులో ఉన్న ఆదిత్యను కొంతమంది ఏజెంట్లు కలుస్తున్నారు. ఇదంతా విచారణ సమయంలో జరుగుతోంది. ఆ సమయంలో ఆదిత్య వారితో కీలక వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈ విచారణ మొత్తం ఈఎస్ఐ రోడ్డులో ఉన్న అద్విక ట్రేడింగ్ కంపెనీలో జరుగుతోంది. పోలీసులు అరెస్టు చేసి, కేసు పెట్టి జైలుకు పంపినా మళ్లీ బయటకు వస్తానని చెబుతున్నట్టు తెలియవచ్చింది. తర్వాత వ్యాపారాన్ని మరింత రెట్టింపు స్థాయిలో పరుగులు తీయిస్తానని భరోసా ఇస్తున్నట్టు సమాచారం. ఎవరెవరికి బకాయి ఉన్నామో ఆ ప్రతి రూపాయిని తిరిగి చెల్లిస్తానని అభయం ఇస్తున్నాడు.ఆరేడు నెలల సమయం పడుతుందని చెబుతున్నట్టు తెలియవచ్చింది.

ఫ్లాట్‌ను విక్రయించిన యజమానికి ఝలక్

ఆదిత్య పెనమలూరు మండలం తాడిగడపలో రూ.2 కోట్లతో ఒక ఇంటిని నిర్మించాడు. ఇది పూర్తయ్యాక రూ.2.50 కోట్లతో ఆదిత్య, కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న కిరణ్‌కుమార్ కలిసి ఎన్టీఆర్ కాలనీలో ఉన్న ఫిలిం కాలనీలో రెండు ఫ్లాట్లు కొన్నారు. అడ్వాన్స్‌గా బిల్డర్‌కు ఇచ్చిన డబ్బును తిరిగి అద్వికలో పెట్టుబడిగా పెట్టించారు. కొంతకాలంగా చెల్లింపులు ఆగిపోవడంతో బిల్డర్ తిరుగుబాటు చేశాడు. ఆదిత్యను కూర్చోబెట్టి ఆ ఫ్లాట్‌ను తన పేరు మీద బిల్డర్ రాయించుకున్నాడు. ఇదికాకుండా తాడేపల్లిలో రూ.కోటి విలువైన రెండు, మూడు ఫ్లాట్లను బుక్ చేశాడు. వాటికి అడ్వాన్స్‌లు ఇచ్చి ఆ డబ్బును పెట్టుబడిగా తీసుకున్నాడు.

పైసా వసూల్!

(5వ పేజీ తరువాయి)

అధికారులు అవినీతికి పాల్పడుతుంటే ఎస్పీ కార్యాలయంలో ఉండే ఒక అధికారి, ఉన్నతాధికారికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని పోలీసులే చెప్పుకుంటున్నారు.

ఈ సీఐ రూటే సెప'రేటు'!

మచిలీపట్నం నగరం శివారు ప్రాంతంలోని ఓ పేట పేరుతో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు చెందిన సీఐ స్థాయి అధికారి, ఎస్ఐ పోటీపడి మరీ నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని పోలీస్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. తమ వసూళ్ల వ్యవహారాలను పోలీస్ ఉన్నతాధికారులకు చేర వేస్తున్నారనే కారణంతో ఈ స్టేషన్‌లో పనిచేసే నలుగురు కానిస్టేబుళ్లను జిల్లా సరిహద్దున ఉన్న స్టేషన్‌కు మెమో ద్వారా పంపినట్టు తెలిసింది. ఈ విషయంలో ఎవరికి అనుమానం రాకుండా తమకు అనుకూలంగా ఉండే ఒక కానిస్టేబుల్‌ను కూడా అక్కడకు పంపినట్టు సమాచారం. నాలుగు రోజుల వ్యవధిలోనే మళ్లీ తమకు అనుకూలమైన కానిస్టేబుల్‌ను స్టేషన్‌కు తిరిగి తీసుకువచ్చారని పోలీసులు చెప్పుకుంటున్నారు. సదరు కానిస్టేబుల్ స్టేషన్ అధికారికి నమ్మినబంటుగా ఉండి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. తన స్టేషన్ పరిధిలో పేకాట శిబిరాలు నిర్వహించడానికి అనుమతులు ఇచ్చి, వారాల పద్ధతిలో నిర్వాహకుల నుంచి సీఐ స్థాయి అధికారి నగదు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో విజయవాడ సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన సదరు అధికారి పేకాట శిబిరాలు పెద్దఎత్తున నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చారని, ఈ విషయంపై పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేసి సస్పెండ్ కూడా చేసినట్టు తెలిసింది. మచిలీపట్నం వచ్చిన సదరు అధికారి ఇక్కడా పాత దారిలో వెళ్తున్నట్టు పోలీసు వర్గాలు చెప్పుకుంటున్నాయి. అలాగే గుడివాడ నియోజకవర్గంలోని ఒక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ తనదైన శైలిలో ఏ కేసు అయినా సరే తనకు పెద్ద మొత్తంలో నగదు ముట్ట చెబితేనే కేసు నుంచి బయటపడతారని ఆయా కేసుల్లో సంబంధం లేనివారిని, అనుమానితులను బెదిరింపులకు గురి చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి కారణమైన వాహనం ఒకటైతే, వేరొక వాహన యజమానిపై కేసు నమోదు చేస్తానని ఎస్ఐ బెదిరించడంతో బాధితుడు సీసీ పుటేజీలను తానే సేకరించి సాక్ష్యాలు చూపినా.. తాను చెప్పినంత నగదు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడం గమనార్హం. ఈ ఎస్ఐ తీరుపై పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు బాధితుడు సిద్ధమవుతున్నాడు.

కలెక్టర్‌ను ఆశ్రయించిన మహిళా పోలీసులు

ఉమ్మడి జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ బదిలీల్లో ఎస్పీ కార్యాలయ అధికారులు తమ ఇష్టం వచ్చినట్లుగా బదిలీలు చేశారు. వీటిని సరిచేయాలని మహిళా పోలీసులు అధికారులకు విన్నవించినా ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో మహిళా పోలీసులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ బాలాజీకి బదిలీలు సక్రమంగా నిర్వహించలేదని, మళ్లీ బదిలీలు నిర్వహించాలని వినతిపత్రం అందజేశారు. బదిలీల కౌన్సెలింగ్ జరిగే సమయంలో సీనియారిటీని పరిగణనలోకి తీసుకోలేదని, ఖాళీగా ఉన్న సచివాలయాలను పూర్తిస్థాయిలో చూపలేదని మహిళా పోలీసులు కలెక్టర్‌కు వివరించారు. కౌన్సెలింగ్‌లో స్పౌజ్ కేసులను పక్కదారి పట్టించారని, ఈ అంశంపై విచారణ చేయాలని మహిళా పోలీసులు కోరారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 6ను అమలు చేయలేదని, రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు.

నయా దందా!

(5వ పేజీ తరువాయి)

అధికారులతో ప్లాన్ల మాటున బిల్డర్లే బేరసారాలు కుదుర్చుతున్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరిపేందుకు వీలుగా కనిష్ఠంగా రూ.5 లక్షల నుంచి గరిష్ఠంగా నిర్మించబోయే భవనాన్ని బట్టి లంచాలుగా వసూలు చేస్తున్నట్టు సమాచారం. ఇలా తాడిగడప మునిసిపాలిటీ అధికారులు బిల్డర్లను దళారులుగా చేసుకుని అక్రమ భవన నిర్మాణాల పేరుతో లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారని తెలిసింది.

తీసుకున్న ప్లాన్ సాధారణ నివాసం..
కట్టేది అపార్ట్‌మెంట్లు

స్థల యజమానులు సాధారణ నివాస గృహాలకు అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా జీ ప్లస్ 4, జీ ప్లస్ 5లతో అపార్ట్‌మెంట్ తరహాలో నిర్మాణాలు చేస్తున్నారు. మొత్తం ఎనిమిది ఫ్లాట్లతో కూడిన అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నిబంధనలకు పాతరవేసి మరీ అపార్ట్‌మెంట్స్ తరహాలో నిర్మాణాలు చేస్తున్నారు.

మాయమాటలతో అమ్మేస్తారు

ఇలా నిర్మించిన అపార్ట్‌మెంట్ తరహా నిర్మాణాల్లోని ఫ్లాట్స్‌ను అమ్మకానికి పెడతారు. అన్ని రూల్స్ ఉన్నాయని, బిల్డర్లతో కట్టించామని మాయమాటలు చెప్పి అమ్మేస్తారు. కానూరు, తాడిగడప వంటి ప్రాంతాల్లో ధరలు తక్కువగా ఉండటంతో పాటు, ర్యాపిడ్ గ్రోత్ ఏరియాలో ఉండటం వల్ల కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590



ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను పరిశీలించిన కేంద్ర బృందం

గన్నవరం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదలవారిగూడెం, గోపవరపుగూడెం, బీబీగూడెం గ్రామాల్లో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ అభివృద్ధి పనులను ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం పరిశీలించింది. సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, రూరల్ హౌసింగ్ హెడ్ రాజ్ ప్రియాసింగ్ ఆధ్వర్యంలో పలువురు అధికారులు ఈ పరిశీలన చేశారు. వాన నీటిని ఒడిసి పట్టి సంరక్షించే విధానం, రోడ్లు, మామిడి తోటల్లో నీటి నిల్వల సామర్థ్యం పెంచే ప్రక్రియ, గోకులం, సాగు అవుతున్న ఉద్యానవన పంటలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా వాటికి అందిస్తున్న ప్రోత్సాహకాలు పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్వామా పీడీ శివప్రసాద్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో స్వర్ణలత, ఏపీవో రాజు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.


పనుల వివరాలు తెలుసుకుంటున్న రాజ్ ప్రియా సింగ్


ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభలో పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు దంపతులు

విలువలతో కూడిన సేవలు అందించాలి

• వీడ్కోలు సభలో పంచాయతీరాజ్ జిల్లా సెక్రటరీ జి.రామ్మోహన్

ప్రసాదంపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శిగా 44 ఏళ్లపాటు విలువలతో కూడిన సేవలు అందించానని, ఏపీ పంచాయతీ రాజ్ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, పంచాయతీ రాజ్ శాఖ జిల్లా జనరల్ సెక్రటరీగా సమర్థవంతంగా విధులు నిర్వహించానని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు అన్నారు. రామవరప్పాడు రింగ్ సమీపంలో రామవరప్పాడు పంచాయతీ ఆధ్వర్యంలో కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఫైలవరం, కూచిపూడి, రామవరప్పాడు వంటి పంచాయతీలతోపాటు మరో 5 పంచాయతీల్లో సేవలు అందించానన్నారు. 44 ఏళ్ల ఉద్యోగ సర్వీసులో ఎన్నో ఒడిదుడుకులను చూశానని, వాటిని అధిగమించి పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేసినట్లు తెలిపారు.పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శుల సంఘ సభ్యులు, సర్పంచ్ వరి శ్రీదేవి, ఉప సర్పంచ్ అద్దేపల్లి సాంబశివరావు, టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్, కొంగన రవి, కళ్లేపల్లి సాయి రామారాజు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

ఉయ్యూరు: హైదరాబాద్‌లో ఓ టీవీ చానల్ కార్యాలయంపై బీఆర్ఎస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ ఉయ్యూరులో సోమవారం జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రధానసెంటర్‌లో నిరసన తెలిపారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టుచేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

• ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పునాదిపాడు-కేసరపల్లి ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. నియోజవర్గంలోని పలు ప్రధాన రహదారులకు ఆర్ అండ్ బీ నుంచి రూ.186 లక్షలు విడుదలయ్యాయన్నారు. ప్రధాన రహదారుల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో పని చేస్తున్నామని తెలిపారు. రహదారి పక్కన ఇరువైపులా డ్రెయినేజీ నిరించాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన కంకిపాడు ఈవో తో మాట్లాడి తక్షణం ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణానికి అంచనాలు వేయించాలని కోరారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఎంపీడీవో అనూష, సర్పంచ్ మునిబోయిన విజయకుమారి, టీడీపీ నాయకులు మద్దాలి రామచంద్రరావు, మద్దాలి సాయిబాబు, నెరుసు సతీష్, మోహన్ కృష్ణ, పులి శ్రీనివాసరావు, మట్టి వెంకట్, జనసేన నాయకులు పులి కామేశ్వరరావు, ముప్పా రాజా పాల్గొన్నారు.

తాడిగడప మునిసిపాలిటీలో

రూ.45 కోట్లతో అభివృద్ధి పనులు

పెనమలూరు : తాడిగడప మునిసిపాలిటీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే రూ.45కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. యనమలకుదురు శివపార్వతీనగర్‌లోని టెంపుల్ రోడ్డులో ఆయన సోమవారం డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. వినాయకనగర్‌లో రూ.2 కోట్ల సీఆర్డీయే నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో యనమలకుదురులో వంద సిమెంటు రోడ్లను వేయించానన్నారు. పెండింగ్ పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. యనమలకుదురులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, అనంతనేని ఆజాద్, ముప్పారాజా, కూటమి నాయకులు పాల్గొన్నారు.


రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

నట్టల నివారణ మందుతో జీవాల్లో ఆశాజనకమైన ఎదుగుదల

ఉంగుటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల(నట్టలు)నివారణ మందుతో గొర్రెలు, మేకల ఆరోగ్యం మెరుగుపడి, ఎదుగుదల ఆశాజనకంగా ఉంటుందని తేలప్రోలు ప్రభుత్వ పశువైద్యాధికారి చింతల మల్లిబాబు అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తేలప్రోలులో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలో జీవాల పెంపకందార్ల ఇళ్లు, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో మేస్తున్న 300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను సిబ్బందితో కలిసి మల్లిబాబు వేశారు.

వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ : ఏలూరు రోడ్డులో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100 మందికి వైద్యురాలు దుబాషి సుభాషిణి వైద్య పరీక్షలు జరిపారు. విజయవాడకు చెందిన నరేష్ హోమియో స్టోర్సు నిర్వాహకుడు ఎన్.విష్ణువర్ధన్ మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ వెచ్చా వెంకటేశ్వరరావు, వాసవీ మాత ఆలయ నిర్వహణ కమిటీ చెర్మన్ రామారావు, ఆర్యవైశ్య సంఘం నేతల్లు ప్రసాద్, పర్యవేక్షించారు.

పోలింగ్ బూత్‌లను పునర్వ్యవస్థీకరించాలి

హనుమాన్‌జంక్షన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో 1,200 మంది ఓటర్లు మించిన పోలింగ్ బూత్‌లను పునర్వ్యవస్థీకరించాలని బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణను కూటమి నేతలు కోరారు. సోమవారం ఓటర్ల జాబితాపై మండల రాజకీయ ప్రతినిధులతో తన కార్యాలయంలో తహ సీల్దార్ సమావేశం నిర్వహించారు. మండలంలో 72,101 మంది ఓటర్లుగా నమోదు అయ్యారని తెలిపారు. గత సాధారణ ఎన్నికల నాటికి మండలంలో 83 పోలింగ్ కేంద్రాలు ఉ న్నాయని, ప్రజల విజ్ఞప్తి మేరకు కాకులపాడు నుంచి విడదీ సి ఆర్యేపేటలో(పీఎస్‌నెం:240) పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కొన్ని గ్రామాల్లో 1200 మంది మించి ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లలో ప్రజలు సకాలంలో ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారని వాటిని వి డదీసి అదనపు బూత్‌లు ఏర్పాటు చేయాలని రాజకీయ పా ర్టీల ప్రతినిధులు కోరారు. బాపులపాడులోని పీఎస్ నెం:209, 218, 221, మల్లవల్లిలో 197,198, సింగన్నగూడెంలో 184 పోలింగ్ కేంద్రాల భవనాలు ఇరుకుగా ఉన్నాయని వాటిని విశాలమైన భవనాల్లో ఏర్పాటు చేయాలని కూటమి నేతలు గోపాలకృష్ణ, రాజేశ్వరరావు, శివ నాగేశ్వరావు, మురళీధర్, లక్ష్మీనారాయణలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.


మురళీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న కూటమి నేతలు

ఏలూరు కాలువకు సజావుగా సాగునీరు

• ఏలూరు కాలువ, కాకులపాడు, వీరవల్లి చానళ్లు, పెరికీడు-1 డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు
• సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు


తిప్పనగుంట చానల్ లాకుగేట్లను ప్రారంభిస్తున్న డీసీ చైర్మన్ రాజేష్, ఆరుగొలను నీటిసంఘం అధ్యక్షుడు విష్ణుకుమార్

(ఆంధ్రజ్యోతి-హనుమాన్‌జంక్షన్‌రూరల్): లక్షలాది ఎకరాలకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించే ఏలూ రు కాలువకు ఎట్టకేలకు గ్రహణం వీడి నీరు సజావుగా సా గుతోంది. 'కాలువ నిర్వహణపై కలవరం' పేరుతో ఆంధ్రజ్యోతిలో జూన్ 10వ తేదీన ప్రచురించిన కథనానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పందించారు. ఆయన ఆదేశాలతో సాగునీటికి ప్రధానమైన ఏలూరు కాలువతో పాటు బాపులపాడు మండలంలోని కాకులపాడు చానల్, వీరవల్లి చానల్, పెరికీడు-1డ్రెయిన్‌లలోని గుర్రపుడెక్కను తొలగించడంతో పాటు రసాయనాలను అధికారులు పిచికారీ చేయించారు. దీంతో సాగునీటి పారుదలకు ఇబ్బందులు తొలగిపోయాయి. కాకులపాడు చానల్‌కు శనివారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నీరు విడుదల చేశారు. నూతనంగా నిర్మించిన తిప్పనగుంట చానల్‌కు ఆదివారం డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ పూజలు చేసి నీటిని విడుదల చేశారు. భారీ వర్షాలకు పంట మునగకుండా ఉన్న సుందరయ్య చానల్, పెరికీడు-1 డ్రెయిన్లు బాగుచేయడంతో ఈఏడాది ముంపు ముప్పు తప్పినట్లే అని రైతులు అంటున్నారు. రుతుపవనాల రాక ఆలస్యమయినా సాగునీటి కాలువల మరమ్మతులు పూర్తవడం అదేసమయంలో ఏలూరు కాలువకు నీరు విడుదల చేయడంతో అన్నదాతల్లో ఆనందం కనబడుతోంది. కాకులపాడు, ఆరుగొలను, దంటగుంట్ల, కానుమోలు, రామన్నగూడెం, రంగయ్యప్పారావు పేటగ్రామాల్లోని రైతులు ఆంధ్రజ్యోతికి, ఎమ్మెల్యే యార్లగడ్డకు కృతజ్ఞతలు తెలిపారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ముంపు ముప్పు తొలగినట్టే

ఏలూరు కాలువకు అనుసంధానంగా ఉన్న 5 సాగునీటి కాలువల పూడికతీత, డ్రెయిన్లలో కిక్కిస పొదల తొలగింపు పనులు పూర్తవడంతో సాగునీటికి ఇబ్బంది ఉండదు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో జలవనరుల శాఖ అధికారుల సహకారంతో 20రోజులుగా రూ.కోటి 80లక్షల వ్యయంతో పూడితతీత తొలగింపు, కిక్కిస పొదల నిర్మూలనకు రసాయనాలు పిచికారీ, శిథిలావస్థకు చేరుకున్న షట్టర్లను నూతనంగా నిర్మించడం పూర్తిచేశాం.

- కొమ్మారెడ్డి రాజేష్, డీసీ చైర్మన్

ప్రజాసమస్యలపై కలెక్టర్‌కు వినతి

ఉంగుటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో సంభవించిన వరదలకు మండలంలో బుడమేరు, వన్నేరు, పెద అవుటపల్లి చానళ్లకు పడిన గండ్లు పూడ్చకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, సత్వరమే గండ్లు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని కౌలురైతుసంఘం, వ్యవసాయకార్మికసంఘం నాయకులు సోమవారం మచిలీపట్నంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేశారు.

ఆత్కూరు పీఏసీఎస్‌లో జేఎల్జీ గ్రూపులకు వడ్డీ రాయితీ కల్పించాలి

ఆత్కూరు పీఏసీఎస్‌లో జేఎల్జీగ్రూపులు తీసుకున్న రుణాలకు వడ్డీ రాయితీ కల్పించాలని కోరుతూ రైతుసంఘాల నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2011లో ఏర్పడిన జేఎల్జీ గ్రూపులు స్థానిక కో ఆపరేటివ్ సొసైటీలో రుణాలు తీసుకుంటూ వడ్డీతో సహా ప్రతి ఏడాది జమచేసేవన్నారు. గత ప్రభుత్వహయాంలో(2022లో)సొసైటీలో జరిగిన అవకతవకలవల్ల జేఎల్జీ గ్రూపులు తాము తీసుకున్న రుణాలు అప్పట్లో చెల్లించేందుకు ముందుకొచ్చినా సొసైటీ అధికారులు జమచేసుకోలేదన్నారు. అవినీతి లెక్కలు తేలడంతో 2024 నవంబరు నుంచి గ్రూపులపై ఒత్తిడి తెస్తూ అసలుతోపాటు మూడేళ్లకు వడ్డీ చెల్లించాల్సిందేనని ఇప్పటికి మూడుసార్లు నోటీసులు పంపారని తెలిపారు. జేఎల్జీ గ్రూపులకు వడ్డీరాయితీ కల్పించి ఆదుకోవాలని నాయకులు టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర వెంకటేశ్వరరావు తదితరులు కలెక్టర్‌ను కోరారు.


కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేసి సమస్యలను వివరిస్తున్న లక్ష్మణస్వామి, వెంకటేశ్వరరావు

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోండి

●మహిళా సర్పంచ్‌లకు ఆర్డీవో హేలాషారోన్ సూచన

ఉయ్యూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మహిళా ప్రజాప్రతినిధులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని స్వతంత్రంగా పనిచేయాలని ఆర్డీవో బి.హేలాషారోన్ సూచించారు. మండలపరిషత్ కార్యాలయ ఆ వరణలో కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు మూడురోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. శిక్షణలో భాగంగా మహిళా సర్పంచ్‌లను గ్రూపులుగా ఏర్పాటుచేసి వివిధ అంశాలపై చర్చలు నిర్వహించారు. ఎల్.శివశంకరరావు, బి.అశోక్, జి.సుధాప్రవీణ్, ఎ.కిరణ్మయి శిక్షణ ఇచ్చారు.

స్వయం సహాయక సంఘం సొమ్ము స్వాహా చేసిన వారిపై కేసు

ఉయ్యూరు: స్వయం సహాయక సంఘం సభ్యుల సొమ్ము రూ.7,39,170 సొంతానికి వాడుకున్న సంఘం లీడర్ ఆమె భర్తపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు. కాటూరు రోడ్డులో కొందరు మహిళలు సోనియా స్వశక్తి పేరుతో సంఘం ఏర్పాటుచేసి లీడర్‌గా ఉప్పల ఉమాదేవి, డిప్యూటీ లీడర్‌గా మైనం నాగమల్లేశ్వరిని నియమించుకున్నారు. ప్రతినెలా సంఘ సభ్యులు చెల్లించిన వాయిదాల డబ్బును ఉమాదేవి ఆమె భర్త శివశంకర్‌రావు కుటుంబ అవసరాలకు ఉపయోగించుకుని మిగిలిన 9మంది సంఘ సభ్యులను మోసం చేశారు. డిప్యూటీ లీడర్ నాగమల్లేశ్వరి చేసిన ఫిర్యాదుపై ఉమాదేవి, శివశంకర్‌రావుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ఆక్రమణలు తొలగించాలి

హనుమాన్‌జంక్షన్ : స్టేట్‌బ్యాంక్ పక్క వీధిలో రోడ్డు ఆక్రమణలు తొలగించాలని బాపులపాడు పంచాయతీకి ఏపీసీఆర్డీఏ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. రహదారి ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని సీఆర్డీఏ అధికారులకు ఆ రోడ్డు వెనుక అపార్ట్‌మెంట్‌వాసులు ఫిర్యాదు చేశారు. దీంతో సీఆర్డీఏ అధికారులు గ్రామపంచాయతీకి నోటీసులు జారీ చేశారు.

ఉయ్యూరు రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట

ఉయ్యూరు: 2024లో వివిధ సేవాకార్యక్రమాలు నిర్వహించినందుకు రోటరీ క్లబ్‌కు ఎనిమిది ఉత్తమ సేవా అవార్డులు లభించాయని క్లబ్ అధ్యక్షుడు నాగ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన రోటరీ జిల్లా 3020 అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు నుంచి తాను, కార్యదర్శి అమీర్ మీర్జా, మాజీ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్ అవార్డులు అందుకున్నామని తెలిపారు. అవార్డులు అందుకున్న క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులకు పలువురు అభినందనలు తెలిపారు.

చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీపై రుణాలు

హనుమాన్‌జంక్షన్ : చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించడమే గోదావరి-కృష్ణా కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు లక్ష్యమని హనుమాన్‌జంక్షన్ బ్రాంచి ఎస్‌బీఎం వేణు తెలిపారు. విజయవాడ రోడ్డులో నూతన బ్రాంచీని సోమవారం ఆయన ప్రారంభించారు. అన్ని రకాలు రుణాలు ఇవ్వడంతో పాటు 12శాతం వడ్డీపై దీర్ఘకాలిక, స్వల్పకాలిక డిపాజిట్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీఎం నరేంద్ర, గుడివాడ బ్రాంచ్ డైరెక్టర్ రంగనాయకులు, స్థానిక ప్రముఖుడు ఎదురువాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్షయ, అతిసారపై అప్రమత్తత అవసరం

గన్నవరం: క్షయ, అతిసారపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు డాక్టర్ టి.జితేంద్ర కుమార్ సూచించారు. ఆత్కూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో సోమవారం క్షయ వ్యాధి, అతిసారపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. క్షయ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తేనే నివారణ సాధ్యమవుతుందని జితేంద్ర తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, ప్రమీలారాణి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

పూడికతీత పనులు పరిశీలన

పమిడిముక్కల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల కాలంలో కాల్వల పూడిక తీతకు నోచుకోపోవడంతో పొలాలకు సాగునీరందక రైతుల ఇబ్బందులు గమనించిన కూట మి ప్రభుత్వం పంటకాల్వలు, మురుగు కాల్వల నిర్వహణ చేపట్టి రైతు సంక్షేమ ప్రభుత్వంగా నిలుస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధి ఫతేలంక వద్ద బందరుకాల్వలో కొనసాగుతున్న పూడికతీత పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



నట్టల నివారణ మందు వేస్తున్న రామలింగేశ్వరరావు

నట్టల నివారణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కూచిపూడి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ పథకాన్ని గొర్రెలు, మేకల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని మొవ్వ మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. చినముత్తేవిలో ఏర్పాటు చేసిన నట్టల నివారణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కొమ్ము సౌధామణి, భోగాది నాగేశ్వరరావు, జోగి సాయి ప్రసాద్, జి.వెంకయ్య, గారపాటి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న తులసీరావు

విల్సన్ మృతి పార్టీకి తీరనిలోటు

పామర్రు : కార్మిక, కర్షక సామాజిక ఉద్యమాల్లో కీలకమైన సేవలందించిన పామర్రు మండల వ్యవసాయకార్మిక సంఘనేత మూళ్లపూడి విల్సన్ అనారోగ్యంతో మృతిచెందడం కార్మిక సంఘాలకు తీరనిలోటని రాష్ట్ర సీపీఎం సీనియర్ నేత బీఆర్. తులసీరావు పేర్కొన్నారు. స్థానిక చాట్లవానిపురంలో మండల సీపీఎం కార్యదర్శి ఒడుగు గంగాధర ప్రసాద్ అధ్యక్షతన విల్సన్ సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆ పార్టీనేతలు విల్సన్ పార్టీకి కార్మికులకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, వ్యవసాయ, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కరువు

● అస్తవ్యస్తంగా ఉన్న రహదారి
● వెలగని వీధిలైట్లతో ఇబ్బందులు
● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - కూచిపూడి): కూచిపూడి జగనన్న కాలనీలో కనీస మౌలిక వసతులు లేని కారణంగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, డ్రెయినేజీ సౌకర్యాలు ఇప్పటికీ కల్పించలేదు. రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు అల్లుకుపోయి రహదారులు కనిపించటం లేదు. వీధిలైట్లు వెలగకపోవటంతో అంధకారంలో కాలనీ వాసులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. పిచ్చిమొక్కలు అల్లుకుపోవటంతో పాటుగా వీధి లైట్లు వెలగకపోవటంతో విష సర్పాలు సంచరిస్తున్నాయని కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలో లైట్లు ఏర్పాటు చేయాలని అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే లేరని కాలనీ వాసులు వాపోతున్నారు. చెత్త వాహనం కాలనీలోకి రాకపోవటం వల్ల ఎక్కడి చెత్త అక్కడే గుట్టలుగా పేరుకుపోయింది. కాలనీల్లో గృహాలు నిర్మించుకుని రెండేళ్లు అవుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నరీతిలో సమస్యలు తిష్ట వేశాయి. పెదపూడి జగనన్న కాలనీలో సైతం ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి జగనన్న కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిపాదనలు పంపాం

జగనన్న కాలనీలో రహదారికి, డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణంతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపడతాం. ఒకటి, రెండ్రోజుల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు తొలగించటంతోపాటు వీధిలైట్లు పునరుద్ధరిస్తాం.

పుష్పనాథం, కూచిపూడి గ్రామపంచాయతీ ఈవో



పూర్తిగా ధ్వంసమైన రహదారి



రహదారిని కమ్మేసిన పిచ్చిమొక్కలు

టిడ్కో కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతి

గుడివాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : టిడ్కో కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌కె మాట్లాడుతూ కాలనీలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కాలనీవాసులు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. వీధిదీపాలు సైతం వెలగడం లేదని, వాటిని వెంటనే సరిచేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో మాట్లాడి టిడ్కో కాలనీలో సమస్యలను పరిష్కరించాలని చెప్పిన ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. అధికారులు స్పందించి కాలనీ సమస్యలను పరిష్కరించాలని ఆర్‌కె కోరారు. లంకా రాంబాబు, సత్య, చరణ్, బోనం గోపిక తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

తోట్లవల్లూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లపాటు కుమ్మమూరు డిస్ట్రిబ్యూటరీ పాయింట్(డీపీ)ని పునర్నిర్మించకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే కూటమి ప్రభుత్వం 12 నెలల్లో నిర్మించి ఇది రైతుల ప్రభుత్వమని రుజువు చేసిందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. బందరు కాలువపై పెనమకూరు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రామినేని వెంకట రామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ. 4.50 లక్షలతో పునర్నిర్మించిన కుమ్మమూరు డీపీని సోమవారం పూజలు నిర్వహించి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ నిధులు విడుదల కాకపోయినా నీటి సంఘం అధ్యక్షుడు వెంకట రామారావు నిధులు సమకూర్చి డీపీని నిర్మించటం గొప్ప విషయమన్నారు. కుమ్మమూరు పరిధిలోని వందల ఎకరాలకు బందరు కాలువ నుండి సాగునీరు అందించబడుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ అపర్ణ, ఏఈ నాగబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, లుక్కా రేణుకారావు తదితరులు పాల్గొన్నారు.



కుమ్మమూరు డీపీకి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

● డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు

గుడివాడ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మహిళా సర్పంచులు బాధ్యతాయుతంగా తమ పదవులు నిర్వహించాలని డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ, పెదపారుపూడి, పామర్రు మండలాల మహిళా సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని, స్థానిక సంస్థల్లో మహిళల పాత్ర అత్యధికంగా ఉందని తెలిపారు. శిక్షణా తరగతుల్లో విలువైన సమాచారాన్ని తెలుసుకోవాలని అన్నారు. ప్రతీ సర్పంచ్ గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు. పంచాయతీలకు ఏలాంటి నిధులు వస్తాయో తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తోట్లవల్లూరు ఎంపీడీవో వెంకటేశ్వరమ్మ, ట్రైనర్లు గుడివాడ, గుడ్లవల్లేరు, నందివాడ, పెదపారుపూడి, మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నారు.



అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న మహిళా సర్పంచ్‌లు

ఖరీఫ్ సాగుకు రైతుల సమాయత్తం

కూచిపూడి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మొవ్వలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. బోర్ల కింద పోసిన నారుమడులు సిద్ధం కావటంతో పలు గ్రామాల్లోని రైతులు నాట్లకు శ్రీకారం చుట్టారు. కారకంపాడు, బార్లపూడి, పెడసనగల్లు, భట్లపెనుమర్రు, అయ్యంకి, కూచిపూడి, మొవ్వ తదితర గ్రామాల్లో నాట్లు ప్రారంభమయ్యాయి. నారులాగి నాట్లు వేసేందుకు ఎకరాకు రూ.5 వేలు ఖర్చు అవుతున్నట్టు రైతులు తెలుపుతున్నారు. మరి కొందరు రైతులు నారుమడులు పోసుకునేందుకు పొలాలు సిద్ధం చేస్తున్నారు. కాలువలకు సాగునీరు విడుదలైన వెంటనే నారుమడులు పోసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. వర్షాలు వెనుకంజ వేయటం, కాలువలకు సాగునీరు విడుదల కాకపోవటం వల్ల నారుమడులు పోసుకునేందుకు జాప్యం ఏర్పడింది. ఈ ఏడాది మొవ్వలో 11,250 హెక్టార్లలో నాట్లు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.



కూచిపూడిలో నాట్లు వేస్తున్న కూలీలు

ప్రాథమిక దశ నుంచే కష్టపడి చదువుకోవాలి

● డీసీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు

పామర్రు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని పామర్రు సాగునీటి సంఘ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని కురుమద్దాలి ఎంపీయుపీ పాఠశాలలోని విద్యార్థులకు ఆయన రూ.10వేలు విలువైన మధ్యాహ్నభోజనం ప్లేట్స్, వంటకు ఉపయోగించే మిక్సీ గ్రేండర్ ఇతర వస్తుసామగ్రిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కూటమి ప్రభుత్వం హాయంలో మానవవనరుల శాఖ మంత్రి లోకేష్ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న వెంకటేశ్వరరావు

వృద్ధులకు భోజన వసతి

గుడివాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : తారకరామా తెలుగు మహిళ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యురాలు అండాళమ్మ సౌజన్యంతో సోమవారం స్థానిక మమత వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన వసతి కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెదపారుపూడి : యలమర్రులోని పొలంలో వరి నాట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ వల్ల ఓ యువకుడు మరణించినట్టు ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లాలోని ముంద్రువానిపాలేనికి చెందిన కలుపుకూరి సూరి (19) ఈ ప్రమాదంలో మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



విజయసారథిని సన్మానిస్తున్న మండల నాయకులు

గుడ్లవల్లేరు ఎంపీడీవో పదవీవిరమణ

గుడ్లవల్లేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు ఎంపీడీవోగా విజయసారథి తక్కువ కాలం విధులు నిర్వహించినా మండల అభివృద్ధికి చక్కని ప్రణాళికతో పనిచేశారని పలువురు వక్తలు అభినందించారు. సోమవారం రాత్రి విజయసారథి పదవీ విరమణ వేడుకలు వేమవరం కొండాలమ్మ ఆలయం సమీపంలోని ఓప్రయివేటు ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. విజయసారథి పనితీరును అందరినీ కలుపుకుని వెళ్లిన తీరును పలువురు అభినందించారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, తహసీల్దార్ లోకరాజు, ఆర్.విక్టర్, ఎండి ఇమ్రాన్, పెదపారపూడి డిప్యూటీ ఎంపీడీవో వంగా వంశి, పెడన డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి, పోలవరపు వెంకటరావు, పలువురు సర్పంచ్‌లు, విశ్రాంత పంచాయితీ కార్యదర్శులు, విశ్రాంత విస్తరణాధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గుడివాడ : వైద్య సేవల నిమిత్తం దుడ్డు నాగపద్మ, కంచర్ల బాలాదిత్యలకు చెరో రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మానవతా స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో అన్నపురెడ్డి గోపిరెడ్డి అధ్యక్షతన సంస్థ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ కె.కృష్ణప్రసాద్‌ను సన్మానించారు. జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ పొట్లూరి వీరశేషగిరిరావు, గుడివాడ చైర్మన్ వేణుగోపాలరావు, కన్వీనర్ ఉప్పలపాటి మారుతీప్రసాద్, కార్యదర్శి పద్మజ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న లోవెల్ కంపెనీ ఎండీ ప్రవీణ్

ఘనంగా లింగమనేని పుట్టిన రోజు

పమిడిముక్కల : ప్రముఖ సామాజికవేత్త, టీడీపీ నాయకుడు లింగమనేని వెంకట్రామయ్య పుట్టిన రోజు వేడుకలు హనుమంతపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. లింగమనేని యూత్, గ్రామపార్టీ నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో వెల్ కంపెనీ ఎండీ ప్రవీణ్, మాజీ వైస్ ఎంపీపీ బాబూరావు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. బొల్లా మల్లిఖార్జునరావు, మోపిదేవి శివనాగేశ్వరరావు సాంబశివరావు, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. గ్రామం లో వెంకట్రామయ్య చేసిన పలు సేవా కార్యక్రమాలు, గ్రామస్థులకు ఉపయోగ పడేలా చేసిన పనులను ఈసందర్భంగా పలువురు గుర్తుచేసి కొనియాడారు.

టిడ్కో గృహాల రుణమాఫీ హామీ నిలబెట్టుకోవాలి

● టిడ్కోకాలని అభివృద్ధి కమిటీ కార్యదర్శి అరుణ

గుడివాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము టిడ్కో లబ్దిదారులను రుణవిముక్తులను చేస్తానని ఇచ్చిన హామీనీ నిలబెట్టుకోవాలని కాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బసవ అరుణ డిమాండ్ చేశారు. మల్లాయిపాలెం శివారుటిడ్కో కాలనీ ప్రధాన సెంటర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30వేల మంది నివసించే టిడ్కో కాలనీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.250కోట్లు కేటాయించేలా గుడివాడలోని అఖిల పక్ష పార్టీల నాయకులు, అభివృద్ధి కమిటీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాల సమ్మె సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ వెంటనే ప్రకటించాలని కోరుతూ అదే రోజు గుడివాడ బంద్‌కు పిలుపునిస్తున్నామని ప్రకటించారు. బ్యాంకర్లు ఈఎంఐ కట్టాలంటూ తమను వేధిస్తున్నారన్నారు. ఈ ధర్నాలో నాయకులు శివరాంప్రసాద్, నాగవాణి, టి.అప్పలనాయుడు, అంబటి లక్ష్మీ, ఎస్.రాంబాబు, శాంతారావు, రంగారావు, పెద్దిబోయిన లక్ష్మీ,నాగరత్నకుమారి, కీర్తి సత్యవతి, మహబూబీ, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న టిడ్కోకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ కార్యవర్గం

గుడ్లవల్లేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు 2025-26 సంవత్సరానికి గాను జూలై ఒకటి నుంచి కొత్త కార్యవర్గం బాధ్యతల్లోకి రానుంది. ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడిగా మేరుగు పెరుమాళ్లు, కార్యదర్శిగా కల్యాణపు నవాబు, ట్రెజరర్‌గా పెంటపాటి చిట్టిబాబులు ఎంపికయ్యారు. తొలి కార్యక్రమంగా జూలై 1 మంగళవారం డాక్టర్స్ డే, వ్యవసాయ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నామని పెరుమాళ్లు తెలిపారు.

గుడ్లవల్లేరు ఎంపీడీవోగా ఇమ్రాన్

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండల పరిషత్ అభివృద్ధి ఇన్‌చార్జ్ అధికారిగా ఎండి ఇమ్రాన్‌ను నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.గుడ్లవల్లేరు ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న టి.విజయసారథి సోమవారం ఉద్యోగ విరమణ గావించారు. దీంతో మండలపరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఇమ్రాన్‌ను పూర్తి అదనపు బాధ్యతల ఎంపీడీవో ఇన్‌చార్జ్‌గా నియమితులైనారు. కాగా మంగళవారం ఆయన బాధ్యతులు చేపట్టనున్నారు.

డీఎల్‌డీవో సుజాతకు సత్కారం

గుడివాడ రూరల్: గుడివాడ డీఎల్‌డీవో సుజాత పదవీ విరమణ సందర్భంగా గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమెను డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గుడివాడ మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు ఆమె 9 నెలలపాటు చేసిన ఉద్యోగ బాధ్యతలను కొనియాడారు. ఆమె శేషజీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు.

గుడివాడ రోటరీ క్లబ్‌కు 20 ప్రతిష్టాత్మక అవార్డులు



అవార్డులను చూపుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

గుడివాడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన జిల్లా అవార్డు ప్రదానోత్సవంలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడకు 2024-25 సంవత్సరానికి గాను 20 ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నట్టు క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు టి.ఎస్ రాజశేఖర్, జి.కిరణ్‌బాబులు తెలిపారు. సోమవారం స్థానిక రోటరీ కార్యాలయంలో క్లబ్ గెలుచుకున్న అవార్డులను చూపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా సంవత్సరంలో అనేక విశిష్ట కార్యక్రమాలను నిర్వహించి, 3020 రోటరీ జిల్లా స్థాయిలో అత్యున్నతంగా నిలిచిందన్నారు. గవర్నర్ అధికారిక సందర్శనను విజయవంతంగా నిర్వహించినందుకు, రోటరీ ఫౌండేషన్‌కు 1000యుఎస్ డాలర్లు ఇచ్చినందుకు రెండు ప్రత్యేక మిడ్‌టర్మ్ అవార్డులతో పాటు పలు అవార్డులు గెలుచుకున్నట్లు తెలిపారు. క్లబ్ కౌన్సిలర్ డా.జి.బాబుశ్రీకర్, రోటేరియన్ డా.పి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ పెదపారుపూడి, పమిడిముక్కల కార్యవర్గాల ఏకగ్రీవం

పెదపారుపూడి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పెదపారుపూడి అధ్యక్షుడిగా నాగనబోయిన గాంధీ, కార్యదర్శిగా మేడేపల్లి రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు కంకిపాడు సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ (డీసీ), పెదపారుపూడి మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు దేవినేని రత్నభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ స్వగృహంలో జరిగిన గ్రామ పార్టీ కార్యకర్తలతో సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. అనంతరం పార్టీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ అభివృద్ధి విషయమై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు కలపాల కిశోర్, గ్రామ పార్టీ నాయకులు సాయిల వాసు, చాపరాల పున్నయ్య చౌదరి, చెరుకూరి మల్లిఖార్జునరావు, నాగనబోయిన శ్రీనివాసరావు, పునుకొల్లు కన్నబాబు, చాపరాల సాంబశివరావు, సాయిల నాగరాజు, గోగం రామారావు, పీక ఫణి పాల్గొన్నారు.

పమిడిముక్కల : టీడీపీ పమిడిముక్కల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. వీరంకిలాకు శ్రీనివాస కల్యాణమండపంలో సోమవారం నిర్వహించిన సమావేశములో అధ్యక్షుడిగా కూడేరుకు చెందిన రాజులపాటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా మేడూరుకు చెందిన కొల్లూరు బాబ్జి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగార్జున ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సాయన పుష్పావతి, ఐ.ప్రేమ్‌చంద్‌కుమార్, తుమ్మల రామ్‌కుమార్ ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. 25 గ్రామాలకు చెందిన పార్టీ అధ్యక్ష , కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి పార్టీ సీనియర్ నాయకుడు జక్కాశ్రీనివాసరావు, అబ్బాస్ అలీ మీర్జా, గంటా సురేశ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



టీడీపీ పెదపారుపూడి అధ్యక్షుడికి అభినందనలు తెలియజేస్తున్న నేతలు



టీడీపీ పమిడిముక్కల మండల నూతన కార్యవర్గం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలి

కోడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ కూడా మొక్కలు నాటి పరిరక్షించాలని ఉయ్యూరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణ నాయక్ అన్నారు. కోడూరు, మందపాకల విద్యుత్ సబ్ స్టేషన్లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సబ్ స్టేషన్ రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెండు గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద మొక్కలను నాటారు. అవనిగడ్డ విద్యుత్ శాఖ ఏడీఏ నడకుదుటి సుబ్రహ్మణ్యం, ఏఈ గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవి వార్పు లాకుల వద్ద నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

దివిసీమకు సాగు, తాగునీరు విడుదల

మోపిదేవి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జలవనరుల శాఖకు కూటమి ప్రభుత్వం పునరుత్తేజం కలిగించిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మోపిదేవి వార్పు వద్ద సోమవారం ఆయన కూటమి నేతలతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, కృష్ణమ్మకు సారె సమర్పించి దివిసీమకు సాగు, తాగునీటిని విడుదల చేశారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే అవనిగడ్డ నియోజకవర్గంలో కాలువలు, డ్రైనేజీలు అభివృద్ధికి రూ.15 కోట్లు వెచ్చించామన్నారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ ఆధునీకరణ చేశామన్నారు. ఆరు మండలాల్లో ఉన్న అవుట్ ఫాల్ స్లూయిస్ ఆధునీకరణ కోసం అంచనాలు రూపొందించి నా బార్డుకు పంపించామన్నారు. రూ.36 కోట్లతో పంపిన ప్రతిపాదనలు మంజూరైనట్లైతే ఇరిగేషన్, డ్రైనేజీ రంగాలు పూర్తిగా ఆధునీకరణ చేసినట్లేనన్నారు. కె.కొత్తపాలెం వద్ద కేఈబీ కెనాల్ నుంచి మచిలీపట్నం వెళ్లే తొమ్మిదో నెంబర్ కాలువలకు దివి మార్కెట్ యార్డు ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్ ప్రత్యేక పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. కొక్కిలిగడ్డ పంచాయతీ శివారు బండికోళ్లలంక లాకుల వద్ద డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, ఇరిగేషన్ శాఖ ఈఈ రావెళ్ల రవికిరణ్, నీటి సంఘం అధ్యక్షులు వేములపల్లి పిచ్చేశ్వరరావు ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. మోపిదేవి వార్పు వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న 12వ నెంబరు కాలువ వద్ద నీటి సంఘం అధ్యక్షులు భోగిరెడ్డి సాంబశివరావు, దివి మార్కెట్ యార్డు ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఆయా కార్యక్రమంలో జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, పీసీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు రావి నాగేశ్వరరావు, నడకుదుటి జనార్ధనరావు, యాసం చిట్టిబాబు, పూషడపు రత్నగోపాల్, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, మాజీ ఎంపీపీలు మోర్ల జయలక్ష్మి, బండే కనకదుర్గ, ఇరిగేషన్ శాఖ డిఈ దాసరి గౌతమి, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, చందన రంగారావు, మత్తి నాగమల్లేశ్వరరావు, ఏఈలు పి.రవితేజ, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఘంటసాలపాలెం చిన్నదళితవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు దేవిప్రసాద్

అంబేడ్కర్ ఆలోచనా విధానం అనుసరణీయం

• రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవిప్రసాద్

ఘంటసాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవిప్రసాద్ అన్నారు. ఘంటసాలపాలెం చిన్నదళితవాడలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో దేవిప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగమే సుప్రీం అన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ ఇటీవల భారత రాజ్యాంగం గురించి మాట్లాడిన విషయాలను ఆయన ప్రస్తావించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్ని వర్గాల నాయకుడన్నారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పోషించిన పాత్ర అనితర సాధ్యమన్నారు. సమానత్వం బౌద్ధమతంతోనే సాధ్యమని గ్రహించిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆ మతాన్ని స్వీకరించారన్నారు. ప్రముఖ బౌద్ధ క్షేత్రం ఘంటసాల సమీపంలోని ఘోటకం స్థూపం ప్రాంతంలో డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ 11 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తొలుత కొడాలి సెంటర్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఘంటసాలపాలెంలోని పెద్ద దళితవాడలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జెండా దిమ్మెను ఎస్సీ కమిషన్ మాజీ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఆవిష్కరించారు. సర్పంచ్ దోనె రజని అధ్యక్షతన జరిగిన సభలో ఏపీ న్యాయ శాఖ జాయింట్ సెక్రటరీ వెలగలపల్లి వెంకటేశ్వరరావు, ఏబీఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తుమ్మల చౌదరిబాబు, కృష్ణా మిల్క్ యూనియన్ కార్యవర్గ సభ్యులు వేమూరి సాయి వెంకట రమణ, దళిత నాయకులు దోవా గోవర్ధన్, రామారావు, దాని సీతారామరాజు, మత్తే నాగరాజు, కె.వి.కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు కొల్లూరి విజయ, ఉపసర్పంచ్ కంచర్ల లక్ష్మి, పల్లికొండ సుబ్రహ్మణ్యం, గడ్డేటి కిషోర్, దోనె వెంకటేశ్వరరావు, విగ్రహ నిర్మాణ కమిటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి సాయం

నాగాయలంక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పర్రచివర గ్రామంలో అగ్ని బాధిత రామదండుకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని సోమవారం వెంకట్రామ్ పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయమందించారు. నాగాయలంక రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్ ద్వారా హైపీ టార్పాలిన్, స్టీల్ సామాగ్రి సెట్, హైజినిక్ సెట్, బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. దేవనబోయిన వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, మంచాల బాబు, ఉమారెడ్డి సురేష్, రేమాల మురళీ, బండ్రెడ్డి హరి, బలరాం పాల్గొన్నారు.



విత్తనాల దుకాణంలో తనిఖీ చేసి స్టాకు వివరాలు పరిశీలిస్తున్న ఏవో కె.మురళీకృష్ణ

లైసెన్సు డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలుచేయాలి

చల్లపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు అధీకృత లైసెన్సు కలిగిన విక్రయదారుల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలనీ, పంట చేతికి వచ్చే వరకు విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రశీదు, విత్తనాల బస్తాకున్న ట్యాగును భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని విత్తనాల షాపులు, గోడౌన్‌లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. స్టాకు, ధరల వివరాలను ప్రతిరోజు ప్రదర్శించాలనీ, విత్తనాలు కొనుగోలుచేసిన రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించరాదనీ, ఎక్కువ ధరలకు అమ్మరాదన్నారు. వీఏఏ సాయిచందు పాల్గొన్నారు.



ఏడీఎం శివశ్రీని సత్కరిస్తున్న ఎస్‌డీఎం సుధాకర్‌బాబు, అధికారులు

పదవులకు వన్నె తెచ్చిన ఏడీఎం శివశ్రీ

మచిలీపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవిత బీమా సంస్థ అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ టి.శివశ్రీ తాను నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చారని వక్తలు పేర్కొన్నారు. పదవీ విరమణ సందర్భంగా సోమవారం జీవిత బీమా సంస్థ డివిజనల్ కార్యాలయంలో ఏడీఎం శివశ్రీని దుశ్శాలువా, గజమాలలతో ఘనంగా సన్మానించారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సత్కార సభలో ఆయన సేవలను కొనియాడారు. ఎస్‌డీఎం డాక్టర్ సుధాక్‌బాబు, సేల్స్ మేనేజర్ శివప్రసాద్, వివిధ బ్రాంచ్‌ల మేనేజర్లు, చీఫ్ ఎడ్వైజర్‌లు, ఏజెంట్లు దుశ్శాలువాలతో, గజమాలలతో ఘనంగా సన్మానించారు.



పంచాయతీ కార్యదర్శికి సమ్మె నోటీసులు అందజేస్తున్న కరీముల్లా

పంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీసు

చల్లపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసేందుకు సహకారం అందించాలని మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాల శానిటేషన్ కార్మికులు, పంచాయతీ కార్మికులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా ఆధ్వర్యంలో కార్మికులు చల్లపల్లి ఎంఈవో -2 పి.వెంకటేశ్వరరావు, చల్లపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి పివి.మాధవేంద్రరావుకు సోమవారం సమ్మె నోటీసులు అందజేశారు. కరీముల్లా మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న 44 చట్టాలను సవరించి పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలుగా కేంద్రం మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల మధ్యాహ్న భోజన పథకం అధ్యక్షురాలు మద్దాల నాగరాణి, ఉప్పల వెంకటేశ్వరమ్మ, కంతేటి పార్వతీ, ఎండి ఫైజున్నీషా, శానిటేషన్ కార్మికులు రాధా, సావిత్రమ్మ, పంచాయతీ కార్మికుల యూనియన్ సభ్యులు ఎస్.జయలక్ష్మి, గోవిందు, కుంభ రమణ, కె.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెలవురోజుల్లోనూ పోస్టల్ పార్శిల్స్ బట్వాడా



ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సెలవు దినాలలో కూడా పార్శిల్స్ పంపిణీ చేసే లక్ష్యంతో సింగిల్ డెలివరీ సెంటర్‌ను ప్రారంభించినట్టు పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. మచిలీపట్నం హెడ్‌పోస్టాఫీసులో సోమవారం సింగిల్ డెలివరీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈనెల 8వ తేదీ నుంచి ప్రప్రథమంగా పోస్టాఫీస్‌లో డిజిటల్ పే మెంట్స్ స్వీకరిస్తామన్నారు. ఫోన్‌పే కూడా అంగీకరిస్తామన్నారు. క్రెడిట్‌కార్డు చెల్లింపులను కూడా స్వీకరిస్తామన్నారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన తొలి అడుగును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలకు తొలి అడుగు కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, వైసీపీ తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ, చేసిన మంచిని చెప్పుకోలేకపోతే నష్టపోతామని హెచ్చరించారు. అర్జా వెంకట నగేష్, యక్కల శ్యామలయ్య, శలపాటి ప్రసాద్, పోతన స్వామి, కూనపరెడ్డి వీరబాబు, వడుగు తులసీరావు, హన్ను తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచాలి

• పెడన కౌన్సిల్‌లో కౌన్సిలర్ చంద్రబాబు



పెడన, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘానికి ఆదాయ వనరులు పెంచాలని, పట్టణంలో పారిశుధ్య పరిస్థితిని మెరుగుపరచాలని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ గరికముక్కు చంద్రబాబు కమిషనర్‌కు సూచించారు. పెడన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో అజెండాలోని 13 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా మునిసిపాలిటీకి రావలసినంత ఆదాయం రావడం లేదని, అనుమతులు లేని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోకపోవడమే దానికి కారణమని ఆయన ఆరోపించారు. ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ మాట్లాడుతూ, కమిషనర్‌గా చంద్రశేఖరరెడ్డి వచ్చాక పట్టణంలో పారిశుధ్య పరిస్థితి మెరుగయిందని ప్రశంసించారు. 17వ వార్డు కౌన్సిలర్ మెట్ల గోపీప్రసాద్ మాట్లాడుతూ, పాత కూరగాయల మార్కెట్ రోడ్డులో ఆక్రమణలు, అక్రమ కట్టడాలు తొలగించిన తరువాతే పాత కూరగాయల మార్కెట్ రోడ్డు వేయాలని సూచించారు. పాత కూరగాయల మార్కెట్ రోడ్డులోని ఆక్రమణల గురించి గోపీప్రసాద్ టీపీవో సృజనకుమారిని ప్రశ్నించగా ఆ రోడ్డును ఇంకా సర్వే చేయలేదని సమాధానం చెప్పారు. 12వ వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ మట్టా శివపావని మాట్లాడుతూ, శానిటరీ సెక్రటరీలు, శానిటరీ వర్కర్ల పనితీరు బాగోనందున పట్టణంలో పారిశుధ్యం క్షీణిస్తోం దన్నారు. వారు సమయపాలన పాటించడం లేదని ఆమె ఆరోపించారు. మునిసిపల్ కార్యాలయంలో అర్ధ రాత్రి వరకు లైట్లు వెలగడానికి కారణం ఏమిటని ఆమె ప్రశ్నించారు. మునిసిపల్ మార్కెట్ల పాటదారులు మునిసిపాలిటీకి సకాలంలో కిస్తీలు కట్టేలా చర్యలు తీసుకోవాలని 19వ వార్డు కౌన్సిలర్ సిరివెళ్ళ జయేష్ సూచించారు. నూతన కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, తగినంత మంది సిబ్బంది, తగినన్ని వాహనాలు లేనందున మునిసిపాలిటీ పారిశుధ్యం విషయంలో వెనుకబడిందన్నారు. అయినప్పటికీ ఉన్న సిబ్బంది, వాహనాలతోనే శక్తివంచన లేకుండా పనిచేసి పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తున్నామన్నారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా మునిసిపల్ వాహనాలలో మాత్రమే చెత్త వేసేలా కౌన్సిల్ సభ్యులు ప్రజలను చైతన్యపరచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆదాయ వనరులు లేని పెడన మునిసిపాలిటీలో పన్నులు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. పన్నులు పెంచితేనే మునిసిపాలిటీ నడస్తుందని ఆయన స్పష్టం చేశారు. తొలుత నూతనంగా వచ్చిన కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, మెప్మా టీఎంసీ ఆనంద్‌లు సభకు తమను పరిచయం చేసుకున్నారు. కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి, మేనేజర్ మట్టా రాజా, టీపీవో సృజనకుమారి, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ఆషాఢ సారె సమర్పణ





గణపేశ్వరం కనకదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు, బందరు నుంచి సారె తీసుకెళ్తున్న భక్తులు

నాగాయలంక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గణపేశ్వరం దుర్గా గణపేశ్వరస్వామి దేవస్థానంలోని దుర్గాదేవి అమ్మవారికి సోమవారం ఆషాఢ సారెను భక్తులు సమర్పించారు. భక్తులు కావిళ్లతోను, పెద్ద పళ్లాలలోను 108 కిలోల పసుపు, కుంకుమలను ప్రత్యేక ఎడ్ల బండి మీద భక్తులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం సారె, పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు అమ్మవారికి సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు పోతకూచి సత్యనారాయణ శాస్త్రి బ్రహ్మత్వంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, లేబాక పద్మప్రియ నేతృత్వంలో ఆషాఢ సారె కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది.

మచిలీపట్నం టౌన్ : విజయవాడ కనకదుర్గమ్మకు మచిలీపట్నం నుంచి 150 మంది మహిళలు గరుడ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో అమ్మవారికి సారె తీసుకుని వెళ్లారు. చిట్టికుమారి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఐ వెంకటేశ్వరరావుకు సత్కారం

పెడన, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపాలిటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావును పదవీ విరమణ సందర్భంగా మునిసిపల్ ఉద్యోగులు, కౌన్సిల్ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఛైర్‌పర్సన్ నాగకుమారి మాట్లాడుతూ, సకాలంలో పన్నులు వసూలు చేయడంలోనూ, మొండి బకాయిలను కట్టించడంలోనూ వెంకటేశ్వరరావు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, ఎటువంటి రిమార్కు లేకుండా తన సర్వీసును విజయవంతంగా పూర్తి చేసిన వెంకటేశ్వరరావు అభినందనీయుడని ప్రశంసించారు. వెంకటేశ్వరరావు దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలు, జ్ఞాపికలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. బంధుమిత్రులు పాల్గొన్నారు.

70 మందికి వైద్య పరీక్షలు

అవనిగడ్డ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కొత్త ఎడ్లంక పాఠశాలలో సోమవారం దాదాపు 70 మంది రోగులకు 104 వాహనం ద్వారా ఉచిత వైద్య సేవలు అందించారు. పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఏఎన్ఎం టి.శారద ఆధ్వర్యంలో ఎంపీహెచ్‌పి మౌనిక, ఆశా కార్యకర్తలు బి.కృష్ణవేణి,ఎం.మహిత, డి.కృష్ణవేణి, డిసివో పి.స్వాతి సేవలందించారు.



నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నాగేశ్వరరావు, తులసీ ప్రసాద్ సేవలు ఆదర్శనీయం

అవనిగడ్డ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కోట నాగేశ్వరరావు, మేకా తులసీ ప్రసాద్ సేవలు ఆదర్శనీయమని ఆర్టీసీ డిఎం హనుమంతరావు అన్నారు. అవనిగడ్డ డిపో గ్యారేజీలో డ్రైవర్లు కోట నాగేశ్వరరావు, మేకా తులసీ ప్రసాద్‌ల పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

75 మందికి కంటి పరీక్షలు

చల్లపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శుక్లాల వైద్యశిబిరం జరిగింది. శిబిరంలో డాక్టరు బి.మోహనరావు 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 33 మందిని ఐఓఎల్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. అమరావతి కంటి ఆసుపత్రిలో బుధ, గురువారాల్లో ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. క్లబ్ ప్రతినిధులు వదరా హరిగోపాల్, వరదా రాజశేఖర్, దేసు జయలక్ష్మి, దింటకుర్తి జ్యోతి, గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, తమ్మన సతీష్‌కుమార్, జూపూడి కిరణ్, మలిశెట్టి చెంచురాములు, నంబూరు కుసుమ, కొల్లిపర సురేంద్ర, నరేంద్ర పాల్గొని శిబిరాన్ని పర్యవేక్షించారు.



ఈవోపీఆర్డీ అప్పల నరసమ్మకు సత్కారం

నాగాయలంక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో నాగాయలంక, అవనిగడ్డ మండలాల పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు సూపరింటెండెంట్ కె.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా, బంటుమిల్లి ఈవోపీఆర్డీ పి.శైలజాకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేయగా, సర్పంచ్ కైతేపల్లి అంకాలు, కార్యదర్శులు జె.హెచ్.వి.పవన్ కుమార్, పి.మల్లిఖార్జునరావు, కొండేటి ఆదిశేషు, తోట శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నవీన్‌బాబుకు సత్కారం

గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : చిట్టిగూడూరు పాఠశాలకు బదిలీ అయిన కంకటావ పాఠశాల ఉపాధ్యాయుడు నవీన్‌బాబును పాఠశాల యాజమాన్య కమిటీ, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఎంఈవో పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, గ్రామసర్పంచ్ మద్దాల వీరవెంకటమోహనరావు, కుటుంబరావు, హెచ్ఎం కె. పోతురాజు, గల్లా దుర్గాదేవి, శ్రీనివాసరావు, దోమతోటి వీరాస్వామి పాల్గొన్నారు.